శ్రీవిలాస్



# లోయనీడలు

గడియారం పదకొండు గంటలు రానట్టే అనుకొంది రాజ్యలక్ష్మి. కాని
కొట్టింది. ఈ రాత్రి రైలులో మరి అయన ఏదో పెద్ద అవాంతరం వచ్చి

పడితేనే గాని, రాత్రి మరొకచోట ఉండి పోయేవారు కారే – రేడియో ఊరుకొంది. వెళ్ళి స్విచ్ ఆఫ్‌చేసి, వచ్చి మంచంమీద కూర్చుంది. నిద్ర రాదు ; చదవడానికి ఏదీ కొత్త పుస్తకమయినా లేదు.

రైలు సరిగా వస్తే పది గంటలకే రావాలి. ఇంత లేటవుతుందా ? ఏమో, జరగవలసిన ఏ పని మహాసవ్యంగా సకాలంలో జరుగుతూంది గనక – ఏమీ తోచక లేచివెళ్ళి మరచెంబులోని నీళ్ళు గ్లాసులో పోసుకొని తాగివచ్చి మళ్ళీ మంచంమీద కూర్చొంది.

ఈ రాత్రికి మరి రారేమో. లైటు ఆర్పి పడుకొంటే సరి. నైట్ బల్బు స్విచ్ ఆన్‌చేసి పెద్దలైటు ఆఫ్ చెయ్యబోతూ ఉండగా వీధితలుపు చప్పుడుతో పాటు "రాజ్యం, రాజ్యం" అన్న వెంకట్రామయ్యగారి పిలుపు వినిపించింది.

తొందరగా వెళ్ళి తలుపు తీస్తూనే "వాసూ ! రెండు రోజుల్లో వస్తానని, ఇన్నాళ్ళు అమ్మని వదిలేసి ఉండిపోయావు" అంటూ దగ్గరకు తీసుకొంది వెంకట్రామయ్యగారి పక్కను నిలబడ్డ కుర్రవాణ్ణి.

"నేనత్తయ్యా ! నేను వాసుని కాను, రామాన్ని – వాడు వాసుగాడు..."

రిక్షావాడికి డబ్బిస్తున్న వెంకట్రామయ్యగారు రామం మాటకు అడ్డుతగిలి "అదంతా నేను చెప్తాన్లే" అని రిక్షా మనిషితో "నువ్వు మరి లోపలకు తేనక్కర్లేదులే; చిన్న పెట్టె, సంచీ. ఇంతేకదూ – మేము తీసుకొని పోగలంలే, నువ్వెళ్ళు" అని పెట్టె తాను పట్టుకొన్నారు. రామం సంచీ పట్టుకొన్నాడు.

పెట్టె పట్టుకొని, తిన్నగా మేడమీదికి వాసు గదిలోకి ఆయన దారి తీశాడు. వెనకాలే సంచీ పట్టుకొని వెళ్ళాడు రామం.

రాజ్యలక్ష్మికి ఇదంతా ఏమీ అర్థం కాలేదు. వారిద్దరి వెనకాలే సగం మెట్లెక్కి అక్కడే అలా నిలబడిపోయింది. మీద గదిలోనుండి వెంకట్రామయ్యగారి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"చూడు రామం, ఇది నీ గది. బాగా చదువుకోడంతో పాటు నీ గదిలోని వస్తువులన్నీ ఎక్కడివక్కడ చక్కగా తీర్చి దిద్దినట్టు ఉంచుకోడం అలవాటు చేసుకోవాలి. అంతేకాని, వాడు, వాసుగాడిలాగ...సరే ఇప్పుడు వాడి సంగతెందుకు – తెల్లవారేసరికి, అంటే అయిదున్నరకల్లా, అంటే నేను లేచేసరికి లేవాలి. ఈ రోజు రాత్రి ఇంతవరకూ పడుకోలేదు గనుక రేపటిమటుకు ఆరు లోపున లేస్తే చాలును. తరవాత నీ కార్యక్రమం అంతా నువ్వే ఏర్పాటు చేసుకొందువుగాని."

"అలాగే మామయ్యా !"

"ఏమన్నావూ ? మామయ్యా అనా ?

సరే, ప్రస్తుతానికి అదే మంచిది. ఈ సంవత్సరం అంతా చూస్తాను. నువ్వు బుద్ధిగా ఉండి, శ్రద్ధగా చదువుకొని, బాగుపడతావనే నాకు నమ్మకంగా ఉంది. కాని, ఆ నమ్మకం వృధా కాకుండా నువ్వు ఋజువు చేసుకోవాలి. అలా అయితే — సరే, అప్పటి సంగతి చూద్దాము. బట్టలు మార్చుకొని, మంచినీళ్ళు తాగి, పడుకో."

"అలాగే మామయ్యా."

వెంకట్రామయ్యగారు కిందకి దిగి వచ్చేసరికి రాజ్యలక్ష్మి కుర్చీలో కూర్చొని ఉంది. ఏదో అడగబోయినట్టుగా నోరు కదిపింది. కాని, మాట బైటికి రాలేదు.

ఆయన తిన్నగా వెళ్ళి మంచంమీద కూర్చొని, "నువ్వు అడగబోయే దేమిటో నాకు తెలుసును. కాని, మరి గత్యంతరం లేకనే ఇలా చెయ్యవలసి వచ్చింది. నేనేమీ అంత తెలివితక్కువ వాజమ్మ ననుకోకు," అన్నారు.

"నేనేమన్నానండి. ఇన్నేళ్ళు వచ్చినా నాకు మీతో మాట్లాడ్డమంటేనే భయం. అబ్బాయిని తీసుకొని వస్తానని వెళ్ళినవారు..."

"అబ్బాయి ? ఎవడు ? వాడు — వాసు గాడేనా ?"

"అదేమిటండీ అలా అంటారు — "

"మరెలా అనమంటారండీ ? మహా పెంచుకొన్నావు, మరెవ్వడూ దొరకనట్టు, లోకం గొడ్డుపోయినట్టు అభిమాన పుత్రుణ్ణి."

"ఇప్పుడు కాదంటే మాత్రం కాక పోతాదా ? వాణ్ణి కాదని, వాళ్ళ అన్న రామాన్ని తీసుకొని వచ్చారా ? వాడు — మా తమ్ముడి కెంత బుద్ధిలేకపోయిందో!"

"అంటే, ఏమిటీ నీ మాటకి అర్థం ? నాకు ఎలానూ బుద్ధిలేదు. నేను అడుగుతే మాత్రం మీ తమ్ముడు తాను ఎలా పంపించా డని కదూ ? ఇప్పుడు కాదు, నలభయ్యవ పడిలో నిన్ను చేసుకొన్నప్పుడే నా బుద్ధి గడ్డి తింది. ఎంత మాటయినా అంటావు."

"ఏమన్నానండీ ? నేను ఎంతగా మీకు తగిన తెలివయినదాన్ని కాకపోయినా నే నన్న మాటలో తప్పేముంది ? వాళ్లమ్మ పోయిన దగ్గరనుండీ, ఈ రెండేళ్ళుగా, వాసుని మనవా డనుకొని, మళ్ళీ ఇప్పుడీ మార్పేమిటి ? మీ భయం నుంచే వా డసలు చదవలేకపోయేవాడు. ఒక్క మారు పరీక్ష పోయినంతలో వాడు ఇక మరి ఎందుకూ పనికి రానట్టేనా ? ఏమయితే మాత్రం మనవాడు అనుకొన్న వాడు మన దగ్గర ఉండాలిగాని — కూర గాయల వంటివి ఒకమారు తీసుకొన్నాక మళ్ళీ మార్చ నివ్వరు కదా — "

"కూరగాయల వంటి వయితే వాటి వల్ల ఒకమారు కలిగిన నష్టంతో సరిపో తుంది. కాని, చూస్తూ, చూస్తూ ఒక

అభాజనుడి కోసం మనం చేసే ప్రయత్నాలు పెదదార్లు పడుతూ ఉంటే —''

''నాకు తెలుసును మీ సంగతి. అందుకే అప్పుడు ఏకంగా దత్తత చేసుకొంటా మన్నాను.''

''అన్నావు. ఎందుకనవూ ? నేనూ నీలాటి మతిలేనివాణ్ణే అయి, ఆ పని చేసి ఉంటే ఇప్పుడు అఘోరించి ఉందుము.''

''అసలు జరిగిన సంగతేమిటో చెప్పకుండా ఈ చిందు లెందుకండీ ?''

''బుద్ధి గడ్డితిని, నీలాటిదాన్ని రెండవ పెళ్ళి చేసుకొన్నాక నేను చిందులు తొక్కే కోతిని కాక మరేమవుతాను ? సరే, నీతో తెల్లవార్లూ వాదించుకొంటూ కూర్చుందుకు నాకు ఓపిక లేదు—ఇక నీ అభిమాన పుత్రుడు చేసిన ఘనకార్యం ఏమిటో తెలుసుకోవాలని ఆత్రంగా ఉందా ? శ్రద్ధగా విను — ఒక భ్రష్టురాలిని లేవదీసుకొని పోయేడు — ఇప్పుడు తెలిసిందా ?''

''రామ ! రామ ! ముక్కుపచ్చలారని పసివాడిమీద ఇవేమి అంభాండాలండీ ?''

''ఏడిచి, మొత్తుకొని, అలిగి, నా నోరు మూయించగలవుగాని, కోడై కూస్తున్న లోకం నోరు మూయించగలవా ?''

.........

''ఇప్పుడు నువ్వెంత కన్నీరు మున్నీరయేలా ఏడిచినా ఒక్కటే. వీడు — రామాన్నయినా నీ వెఱ్ఱిగారాబంతో పాడుచెయ్యకుండా కాస్త క్రమశిక్షణతో మెలగనీ''.

''శిక్షణ కాదు, శిక్ష — అదేదో నా ఒక్కతెకే చాలును. ఒకడికి మనంచేసిన నిర్వాహకం చాలదా ? పసివాడు, రామానికి కూడా ఎందుకు హింస. వాళ్ళకి ఉన్నంత తింటారు; వచ్చినంత చదువు వస్తుంది, లేకపోతే లేదు—అంతేకాని...''

''నీ ఉపన్యాసం ఈ రాత్రంతా సాగేలాగుంది. విను. నేను ఇన్నిమాటలు ఆడేవాణ్ణికాను. నా నిశ్చయానికి తిరుగులేదు. ఆ లైటు ఆర్పేసి, రాత్రంతా కావాలంటే నీ అభిమాన సుపుత్రుడి కోసం ఏడుస్తూకూర్చో.''


''ఏడవడమెందుకూ, ఈ చెరవదలి వాడయినా సుఖంగా బతుకుతాడు.''

''అవునవును. తనకంటె పెద్దయిన భ్రష్టురాల్ని లేవదీసుకొని పోయినవాడు— వీడే లేవదీసుకుపోయాడో, అదే లేవదీసుకుపోయిందో — ఏదయినా ఫలితం ఒక్కటే. హుం, వెధవ సినిమాలూ, పాటలూ, పత్రికలూనూ.''

''మీ నోటికి ఎదురు నిలిచే దెవరు — మీ రేమన్నా, వాడే— వాసే నా కొడుకు. రామాన్ని మళ్ళీ రేపే పంపించెయ్యండి. లేదంటే ఈ ఇంట్లో మీ కింద చాకిరీ చేసినట్టే వాడికిందా చేస్తాను.''

''చెయ్యకేం జేస్తావులే ?''

''అదే మీ ధైర్యం. ఎందుకో నే



"ఆఫీసుకు ఆలస్యంగా ఎందుకొచ్చావు?"
''నిద్ర మెలకువ రాలేదుసార్ !''
''చిత్రం ! నీవు ఇంట్లోకూడా నిద్రపోతావా ?"

---

నింకా బ్రతికిఉన్నాను. ఇంత తిండి పెడుతున్నారుగనక...''

"పోనీ ఇంకా ఆ మాత్రం జ్ఞానం ఉందికదా.''

''జ్ఞానంకాదు, పిరికితనం-యావజ్జీవిత కారాగారం. పేదకుటుంబంలో పుట్టినందుకు శిక్ష - నా కింక ఈ జీవితంలో మరేముంది? నా మాటకేం, వాసూ, ఎక్కడున్నావో, ఎలా ఉన్నావో, నువ్వయినా సుఖపడు; మళ్ళీ ఈ ఖయిదు లోకిమాత్రం తిరిగిరాకు.''

* * *

"వాసూ! వాసూ! ఇక్కడున్నావా? ఏమి టలా తుళ్ళిపడ్డావు?"

"నువ్వేనా మాలా! ఎవరో అనుకున్నాను."

"ఈ రోజంతా కనబడకపోతే నువ్వు వెళ్ళిపోయే వనుకొన్నాను."

"నీతో చెప్పకుండా వెళ్ళిపోతానా? ఇక క్కడ-ఈ చెరువూ, తోటలూ, నువ్వూ-లేకపోతే మరి నాకిక్క డేముంది?''

"అందుకనే కదూ ఈ రోజంతా కనబడడం మానేసేవు!"

"ఈ రోజంతా ఏమిటి చేస్తున్నానో, ఎక్కడ తిరుగుతున్నానో నాకే ఏమీ తెలియకుండా ఉంది."

"తిరిగినంత సేపు తిరిగావు. ఇప్పు

డిక్కు డిలా ధ్యానముద్రలో ఉన్న బుద్ధ భగవానుడిలాగ కూర్చున్నావు."

"అంతమాట అనకు మాలా. తనకు అన్నీ ఉండికూడా ప్రపంచంలోని కష్టాలను, దుఃఖాన్నీ పోగొట్టాలని ఆయన బాధపడ్డాడంటారు. నాకేమో ఈ ప్రపంచంలోని అన్నీ బాగానే ఉంటాయి; పెద్ద వాళ్ళ సరదాలకి వేసే సంకెళ్ళుతప్ప."

"నిజంగానే పెద్దవేదాంతిలాగే మాట్లాడేస్తున్నావు. అసలు నీ మనసులోని బాధ ఏమిటో చెప్పవు.''

"నీకు కాకపోతే ఇంకెవరికి చెప్తాను? అయినా ఇది చెప్పడంవల్ల తీరేదికాదు."

"అంటే నీకు నా మీదకూడా కోపం వచ్చిందన్నమాట. అందుకే కాబోలు ఈ మారు నువ్వు వచ్చిందగ్గర్నుంచీ, నాతోకూడా ఏవో అర్థంలేని నవ్వుతాల మాటలే తప్ప సరిగా మాట్లాడకుండా ఉన్నావు."

"అదేంలే దక్కా! ఏం చెయ్యాలో నాకే నిశ్చయంలేదు. ఈమారు ఇక్కడికి వచ్చిందగ్గర్నుంచీ అదే ఆలోచిస్తున్నాను. కాని, ఇంకా ధైర్యం చాలకుండా ఉంది.''

"నాతో చెప్పడానికీ భయమేనా? చెప్పవుకదూ? వాసూ! నేను నీ అక్కను కాదూ?"

"మరెవ్వరూ లేకపోయినా నిజంగా నీలాటి అక్క అయినా ఉంటే..."

"అంటే నేను నీకు అక్కయ్యని కాననే కదూ - పోనీలే, మీ అత్తయ్యనీ మామయ్యనీ 'అమ్మా' 'నాన్నా' అని అనుకోగలవుగాని, నన్నుమాత్రం నీ అక్కయ్యని అనుకోలేవా?"

"ఉఁహుఁ, వాళ్ళని అనుకున్నట్టే నిన్ను అనుకోలేను. నువ్వు నాకు అక్కయ్యవేకావు, అమ్మవి కూడాను."

"వాసూ, వాసూ, ఏడుస్తున్నావా? అది నాలాటి ఏమీ చేతకానివాళ్ళు చెయ్యవలసిన పని. నా బాబువి కదూ, నాతోకూడా చెప్పకూడదా నీ మనసులోని బాధ."

"చెప్తాను, ఎందుకు చెప్పను? ఏమయినా, నీతో చెప్పకుండామాత్రం వెళ్ళిపోనులే.''

"ఎప్పుడో చెప్తానంటే కాదు, ఇప్పుడే.."

"ఏమిటో భయంగా ఉందక్కా —"

"మాట చెప్పడానికే భయమయితే ఎలా? తరవాత..."

"పని చెయ్యడానికేభయమూలేదు. ముందు ఏం చెయ్యాలీ అన్నది ఆలోచించడమూ,అది ఇంకా తేలకుండానే మాటల్లో చెప్పడం అంటేనే జంకు —''

"నా దగ్గరకూడా నీకు జంకూ, సందేహమూనా? అలా అయితే నేను మరి నీ అక్కయ్యనే కాను."

"కానంటే కాకపోతావేమిటి?అంతగా అక్కయ్యవు కాకపోతే అమ్మవు...... మాలా! మాలా!"

"అమ్మని ఎవరైనా అలా పేరుపెట్టి

పిలుస్తారా ? అదీ మాలతీ అన్న పేరుని తుంచేసి 'మాల' చేసేవు.''

"నీకు నేనలా పిలవడం ఇష్టం లేకపోతే మానేస్తాను. మా అమ్మని తలుచుకొన్నప్పుడల్లా నువ్వు జ్ఞాపకం వస్తావు. ఏం, మాట్లాడవు. కోపం వచ్చిందా ? పోనీలే కావాలంటే ఇకనుంచీ మాలతీదేవిగారూ అని పిలుస్తాను, సరా."

"ఇప్పు డెవరికి ఎవరిమీద కోపం వచ్చిందో తేలిపోయింది వాసూ, వాసూ, నీ మాటే నిజం, నువ్వు నా తమ్ముడివే కావు కొడుకువికూడా. ఒక్కమాట, నా గురించి ముందుముందు ఎవరేమనుకున్నా సరే, నువ్వు ఒక్కడివీ అయినా అభిమానంతో నన్ను జ్ఞాపకం ఉంచుకొంటానంటే నా కంతే చాలును."

"అదేమిటమ్మా ! ఏడుస్తున్నావూ ?"

"ఏడవక మరేం చెయ్యగలను?అమ్మా అన్నావు కదూ. ఆలా అమ్మా అని పిలిపించుకొనే అదృష్టం నాకు లేదు."

"నే నున్నానుకదూ. ఇకముందు మనం వేరేగా ఉన్నప్పుడు ఎప్పుడూ నిన్ను 'అమ్మా' అనే పిలుస్తాను. సరా ?''

"నాకు అంతటి అదృష్టమా—అడుగో మీ అన్నయ్య కాబోలు నీ కోసం కేకలు వేసి పిలుస్తూ వెతుకుతున్నాడు. ఒక్కమాట, నా గురించి ఎవ శ్శేమనుకొన్నా సరే, నేను నీ అక్కయ్యని, అమ్మని— నన్ను మరిచిపోకు. నా దగ్గర కొంచెం రూపాయి లున్నాయి. అవి మరి నా కెందుకు, నీ కిచ్చేస్తాను."

"నీ మాటలు వింటూంటే నా కేమిటో భయంగా ఉందక్కా. అబ్బ ఈ అన్నయ్యగాడి గోలొకటి. సరే, రాత్రి అందరూ పడుకొన్నాక...''

''ఉఁ హుఁ వద్దు — సరేలే, పద —''

*   *   *

"ఏమిరా శ్రీనూ ! ఇంకా నిద్ర పోలేదురా ?''

"లేదన్నయ్యా ! నువ్వు పుస్తకం పట్టుకొని చదువుతున్నావు గనక నీకు నిద్ర వస్తున్నట్టుంది."

''అదేన్రా వచ్చిన చిక్కు. ఈ వెధవ నిద్ర లేకుండా ఏదయినా సాధనం ఉంటే బాగుండును.''

''ఇప్పు డింకా సెలవులేకదా, అంత కొంప మునిగినట్టు చదవకపోతే ఏం పోయిందిరా ?''

"తరవాత మరి టైమే ఉండదు ; రోజూ నాలుగు మైళ్ళు నడిచి వెళ్ళి రావడంతోనే సరి. నిరుడు మా క్లాసులో అనసూయకి నాకంటే యాభయ్యారు మార్కులు తక్కువ వచ్చేయా, ఈ ఏడు పన్నెండు మార్కులే తక్కువ.''

"ఇప్పటికీ నీకంటె తక్కువే కద ?''

"ఏం లాభం ? ఈ సంవత్సరం ఎలాగయినా నన్ను దాటి పోతుంది. తన కేమిటి, ఏం తెలియకపోయినా చెప్పడానికి ప్రయివేటు మాష్టారున్నారు.

హాయిగా చదువుకొందికి ఇంట్లో ఏ గోలా ఉండదు. తను చదువుకోడానికి వేరే గది, ఎంత బాగుంటుందనుకొన్నావు!"

"ఏమిటి అంత బాగున్నది? అనసూయా? ఆమె చదువుకొనే గదా?"

"అనసూయకేం, బాగానే ఉంటుంది. కాని, అలాటి మాట లనకూడదు-తప్పు. మంచి పెద్ద టేబిలు, కుర్చీలు, అలారం టైంపీసు, పుస్తకాల షెల్పు..."

"అవన్నీ అక్కడ నాకూ ఉన్నాయి. కాని, ఏం లాభం? నా కసలు చదవాలనే ఉండదు. తప్పనిసరిగా పుస్తకం పట్టు కొంటేనే నిద్ర వస్తుంది. కాని, లేచివెళ్ళి మంచంమీద పడుకొంటే మాత్రం నిద్ర రాదు; ఏవేవో ఆలోచనలు. అందుకని ఒక్కొక్కనాడు కుర్చీలోంచి లేవకుండా అలాగే నిద్రపోతాను. అన్నయ్యా, నువ్వే చిన్నవాడివయి, నేనే పెద్దవాణ్ణయిఉంటే ఎంత బాగుండును! నా కా చదువు బాధ తప్పేది."

"చదువుకోకపోతే ఎలాగురా? నాన్నకి తన గొడవలు, పేకాట తప్ప మనం ఏమయినా అక్కర్లేదు. పిన్నికి ఎంత వేగం మన బాధ వదలిపోతుందా అని ఉంది."

"అన్నయ్యా! నేనేగాని లేకపోతే, అత్తయ్యా, మామయ్యా నిన్నే తీసుకొని వెళ్ళిపోతారు, కదూ? నీకు చక్కగా చదువుకొందికి అన్ని సదుపాయాలూ ఉంటాయి. బాగా చదువుకొని, గొప్ప పేరు, ఎక్కువ డబ్బు సంపాదిస్తావు. నాన్నకికూడా సాయం చేస్తావు. నేనేగాని లేకపోతే..."

"ఛ! తప్పు. అవేం మాటలురా! నాకంటె చిన్నవాడివి. నువ్వయినా సుఖంగా ఉంటే నాకు సంతోషమే – నాకు లేనివి ఎలాగూ లేవు."

"నాకు అక్కర్లేనివి బలవంతంగా నా నెత్తిని రుద్దుతున్నారు. కావలసినవాడివి నీకు లేకుండా చేస్తున్నారు. మన మాట ఎవ్వరూ వినరు. ఉఁహూఁ ఊరుకొని లాభంలేదు. వినేలా చేస్తాను..."

"అన్నయ్యా నిద్రే? పడుకో. పాపం, చదువుకొని అలిసిపోయావు. చదువు కొంటానంటేకూడా పిన్నికి పడదు. అక్కర్లేని పనులు ఏవేవో పురమాయిస్తూ ఉంటుంది. కానీ, ఇంకెన్నాళ్ళలే.. అందరూ నిద్రపోతున్నారు. మాల దగ్గరికి వెళ్ళాలి. ఇందాకా ఎందు కేడిచిందో?"

* * *

"నువ్వేనా వాసూ! రా, చప్పుడు చెయ్యకు. నీకోసమే చూస్తూ కూర్చున్నాను. ఎంత సేపటికీ రాకపోతే నిద్ర పోయేవేమో, మరి నిన్ను చూడలేనేమో అనుకున్నాను."

"అదేమి టక్కా అలా అంటావు? అసలు నువ్వెందు కింత విచారంగా ఉన్నావు? నాతోకూడా చెప్పకూడదా?"

"చెప్పుకోవా లనే ఉంది. కాని, చిన్నవాడివి, నీతో ఏం చెప్పను! ఇదుగో




''నిరాయుధుణ్ణి అనుకొని మీద కొచ్చావుగా !''

ఈ రుమాలులో కట్టి ఉంచేను. నా దగ్గర ఉన్న డబ్బు ఇదే. ఇది మరి నాకు పనికి రాదు. ఇందులో నీకు ఉత్తరం కూడా ఉంది. అయితే ఇప్పుడు చదవకూడదు. రేపు పొద్దున్న చదువుకొని చింపి పారెయ్యి. మరెవ్వరికీ చూపించకూడదు సుమా. చేతిలో చెయ్యేసి, ఒట్టువెయ్యి."

"ఒట్టు. కాని, నాకు నీ మాట లేమీ అర్థం కావడంలేదు. ఎందుకో భయం వేస్తున్నది."

"నీ కెందుకు భయం. హాయిగా వెళ్ళి పడుకో. ఈ నీ అక్కయ్యనో, అమ్మనో, వట్టి 'మాల'నో - నన్ను మాత్రం మరిచిపోకు."

"నాకేమిటో వెళ్ళా లని లేదక్కా. ఇక్కడే నీ దగ్గరే ఉండనీ. నేనిలా చాప మీద పడుకొంటాను. నువ్వు నీ మంచంమీద పడుకో...''

''నా మాట వినవుకదూ, పోనీలే. నా బాబువి కదూ.''

"అలాగే వెళ్తానులే. నీకు నేనుంటే చికాకులా గుంది."

''ఏమిటన్నావు? పోనీలే, నీకూ నా మీద కోపం వచ్చినట్టుంది. ఏదీ ఇలారా, మా బాబువు కదూ, ముద్దుపెట్టుకొన్నాను కదూ, ఇప్పుడు కోపం పోయిందా? వెళ్ళి పడుకో."

''అలాగే, కాని, నువ్వు పడుకో —''

* * *

ఎందుకో తనకే తెలియకుండా ఇంట్లో నుండి పెరట్లోకి, పెరట్లోనుండి ఇంట్లోకి రెండుమార్లు తిరిగింది మాలతి. అమ్మ పెరటి వరండాలో హాయిగా నిద్ర పోతున్నది.

గదిలో దీపం సన్నగా వెలుగుతూంది. వెళ్ళి వత్తిని హెచ్చించింది. వెలుగు ఎక్కువయింది. కాని, తన మనసులోని చీకటి మాత్రం అలాగే ఉంది. అబ్బ, దీపం వెలుగు కళ్ళకి గుచ్చుకొంటున్నది. బాగా తగ్గించి తలుపు వారగా ఉంచింది. కిటికీ దగ్గరకు వెళ్ళి అంచుమీద మోచేతు లానించి నిలబడింది.

సుమారు, నాలుగు నెలల క్రితం — తినడానికి ఉంటే ఉంది, లేకపోతే లేదు, చిన్నప్పటినుండీ అలవాటయినదే కదా. అప్పుడూ ఇలా మబ్బుపట్టిఉన్న రాత్రులు నిద్ర వచ్చేదికాదు. కాని, ఎప్పుడు మేలుకొనే కలలు కనగలిగేది. ఇప్పుడు మరి కలలు కనడాని కేముంది ?

ఇంకా ఉంటే అమ్మకి తెలియకుండా దాచడం అసాధ్యం. కొంతవరకు అమ్మదే తప్పు. అతన్ని చనువుగా ఇంటికి రానిచ్చేది. ఇప్పు డెవరి నే మను కొని ఏం లాభం ? అమ్మతో ఏవో ఆశలు పుట్టేలాగ, సరదాగా కబుర్లు చెప్తూనే తనను వశం చేసుకొన్నాడు.

ఇప్పు డదంతా తవ్వుకొని ఏం లాభం ? అతనికి భార్యా పిల్లలూ కూడా ఉన్నారట. ఆ మాట ముందే తెలిసి ఉంటే ? — ఎన్ని తియ్యటి కబుర్లు చెప్పేడు — అమ్మకి మతిలేదు, 'ఇక్కడ సినీమాల్లో మంచి అవకాశమే దొరక వచ్చును. మీ అమ్మాయిని పంపించండి' అని రాస్తే, అంతా నిజమే ననుకొం టుంది — ఇక్కడ జరిగింది చాలకనా ?

ఇప్పు డెందు కీ వెర్రిఆశలూ, అలోచ నల్లూ — వర్షపు నీటితో నిండిన చెరు వుంది — అదే తన కిక శరణ్యం.

ఉఁహూఁ ఇక్కడి చెరువు లాభం లేదు. అమ్మకి దుఃఖం ఆగదు. ఎక్కడో, దూరంగా ఎవ్వరికీ గుర్తు తెలియని చోట...మరి బట్టలు డబ్బు ఎందుకు ? బతకా లంటే అన్ని ముందుజాగ్రత్తలు గాని...

* * *

చిమ్మచీకటి — చిన్న చినుకులు — ఉండుండి ఉరుములూ మెరుపులూ. అమ్మ, ఇల్లు, ఊరు, తన ఋణం తీరిపోయింది. ఊరికే తల్చుకోడంవల్ల ఆలస్యం అవడం తప్ప మరేం లాభంలేదు.

పాపం, వాసు, వాడి పసి మనసుకీ హాయిలేదు.

ఇక్కడ ఇంట్లో తండ్రి ఉన్నా లేనట్టే — సవతితల్లి పోరు — ఇవన్నీ తప్పిపోయాయంటే అక్కడా వాడికి సుఖంలేదు. ఒక యంత్రంలా పని చెయ్య మంటారు. ఆడుకోనివ్వరు, పాడుకో నివ్వరు. ఎక్కడా నేర్చుకోకపోయినా ఒక్కమారు వింటే చాలు, ఎంత చక్కగా పాడతాడు...కాని, ఏం లాభం...

ఈరో జంతా ఎక్కడెక్కడో తిరి గాడు. సాయంకాలం తన మనసులోని ఆలోచనలు చెప్తానంటే వినడమే కుదర

లేదు. విని మాత్రం తాను చెయ్యగలిగిం దేముంది ?

వాణ్ణి మరొక్కమారు చూడగలిగితే.. ఉఁహుఁ లాభంలేదు. నిద్ర పోతూ ఉంటాడు. వాడు లేచేలోగా అందరూ లేస్తారు, గొడవవుతుంది. అప్పుడు తనకి ఇల్లు వదలడమే అసాధ్య మవుతుంది.

మళ్ళీ మరొకమారు ఇంత తెగింపు రాదు.

అమ్మవారి గుడి దాటిపోయింది, ఊరి పొలిమేర దాటినట్టే — చినుకులు తగ్గాయి. కాని, ఇంకా మెరుస్తూనేఉంది.

ఇక్కడ ఈ రాయిమీద కొంచెం సేపు కూర్చుంటే ? కూర్చుంటే మళ్ళీ ఏవో ఆశలు చిగురిస్తాయి. అదేం లాభం లేదు. తన బాధలు తనతోనే అంతమయి పోవాలి, అంతేగాని. అమ్మకి కూడా ఎందుకు ఆరాటం ?

ఇప్పుడిలా వెళ్ళిపోయినందువల్ల అమ్మకి కలిగే దుఃఖం వేరు ; ఎదురుగా ఉండి....తనతోపాటు ఇంకొక దిక్కులేని ప్రాణాన్నికూడా...

ఏమిటది వెనకాల చప్పుడయినట్టయింది? ఎవరయినా వస్తున్నారా ? ఉఁహుఁ ఎవరూలేరు. ఎవరికి కావాలి ? తనవంటిది ఒకతె తక్కువయితే లోకానికి అదే మేలు.

చిత్రంగా ఉందే! మళ్ళీ అడుగుల సవ్వడి. నడుస్తూఉంటే వినిపిస్తున్నది — ఆగిపోతే ఆగిపోతున్నది.

దయ్యాలూ భూతాలూ అంటారు. నిజంగా అటువంటి వేవయినా ఉండి తనను తమ లోకంలోకి తీసుకొని పోగలిగితే ఎంత బాగుండును ? కలల్లో, కథల్లో తారసపడే దయ్యాలు కావాలన్నప్పుడు వస్తాయా ?

ఈ అర్ధరాత్రి, చిట్టచీకటిలో, జడివానలో ఒంటరిగా సాగిపోయే తానే, మరెవరికయినా దయ్యంగా కనిపించవచ్చును.

మళ్ళీ అడుగుల సవ్వడి — ఎవరయినా తనను వెంటాడి వస్తున్నారా ? వచ్చి చేయగలిగే దేముంది ? మహా అయితే ఈ రాత్రికి ప్రయాణం ఆగిపోతుంది. అంతేకాని, ఒకమారు నిశ్చయించుకొన్నాక, మరి సాధనాలే దొరకవా ?

అబ్బ ! వర్షం ఎక్కువయింది. వేరే బట్టలుకూడా లేవు. తడి బట్టలతో రైలు స్టేషన్లోకి ఎలా వెళ్ళడం ? అప్పటికి అవే ఆరిపోతాయి. ఒక్క గడియ ఈ జల్లు తగ్గేదాకా ఈ చెట్టుకింద నిలబడితే సరి.

అమ్మకి తననుగురించి మరీ అనుమానాలూ, ఆశలూ, బాధలూ ఎక్కువ కావడానికి గాని, ఇప్పు డెక్కడికో వెళ్ళడం ఎందుకు ? అంతకంటె ఒక్కమారే తన గురించి ఏడిచి ఊరుకొంటుంది. ఊరి చెరువే శరణ్యం.

చినుకులు కాస్త తగ్గినట్టున్నాయి. అబ్బ, ఎంతలా మెరిసింది ! ఎవరక్కడ—

"నేనే అక్కయ్యా! వాసుని. భయపడ్డావు కదూ, దెయ్యం మనుకొని."

"నా భయంమాటకేం గాని, ఇదేమిటి ఇలా బయల్దేరేవు?"

"ఆ మాట నిన్నడగాలనే."

"మంచివాడివే – చీకటి, ఉరుములు, మెరుపులు, గాలివాన – ఇప్పుడింటికెలా వెళ్తావు?"

"వెళ్ళా లనుకొంటే నాకేం భయం లేదుగాని, నువ్వు రావా?"

"రాలేను వాసూ! వచ్చినా ఎక్కువ కాలం బతకలేను. నీ అక్క అందరిచేతా మాటలుపడి, చివరికి భరించలేక ఆత్మహత్య చేసుకొందనేకంటే ఇప్పుడే ఇలా దూరంగా వెళ్ళి కడతేరిపోతే మంచిది కాదా?"

"అందుకేనా ఆ డబ్బు, ఉత్తరం నా చేతి కిచ్చేవు?"

"ఆ ఉత్తరం?"

"ఉఁహుఁ నువ్వు చదవవద్దని ఒట్టు వేయించిన తరవాత ఎందుకు చూస్తాను? అసలు నేను ఇంటికి వెళ్తేకదూ! మీ యింటి గోడవారన నిలబడి అంతా చూస్తూనే ఉన్నాను."

"తమ్ముడూ! తమ్ముడూ! ఎందుకురా నేనంటే నీకింత అభిమానం?"

"నాకెంత అభిమానం ఉంటేనేం? నీకు నామీద దయలేదు. ఉంటే ఇలా చెప్పకుండా వెళ్ళిపోవాలని చూస్తావా? నీమాట నమ్మి నేనేగాని ఇంటికి వెళ్ళి పడుకొనిఉంటే – మరి నిన్ను చూడనే లేకపోయేవాణ్ణి."

"తమ్ముడూ వాసూ! నీ మాటలు వింటూంటే మళ్ళీ నాకు బతకాలని పిస్తోందిరా!"

"అదీ సంగతి. నీ మనసులోని బాధ ఏమిటో చెప్పవు కదూ. మాట్లాడవు కదూ, ఇందాకా నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాననేకదూ ముద్దుపెట్టుకొన్నావు."

"వెళ్ళక ఏం చెయ్యను? అందరిలాగే ఎలాగోలాగు బతకాలనే నాకూ ఉంది. కాని, లాభం లేదురా బాబూ – ఈ చీకటిలో వానలో ఇంటికెలా వెళ్తావో."

"నా గొడవ నీ కెందుకు? నేను ఎవ్వరికీ అక్కర్లేని వాణ్ణి. ఈ వారం రోజులూ ఆలోచించి ఒక నిశ్చయం చేసుకొన్నాను. నాకు ఇక్కడ సుఖం లేదు – అక్కడా మా అత్తయ్య మామయ్య – వాళ్ళకీ నావల్ల ఇబ్బందే గాని సుఖంలేదు. నాకు పాటలంటే సరదా అని ఇంట్లో ఉన్న రేడియో అమ్మేశాడు మామయ్య! అత్తయ్యకి నేనంటే అభిమానమే కాని, ఏం లాభం! 'వాడితో ఏవో సొల్లుకబుర్లు పెట్టక వాణ్ణి చదువుకోనీ' అంటాడాయన."

"నేను మరి అక్కడ ఉండలేను. ఎన్ని ఇబ్బందులయినా ఇక్కడే ఉంటానన్నా ఉండనివ్వరు. అందుకని..."

"అందుకని ఏం చేస్తా నంటావు?"

"ఈ రాత్రి ఎటైనా పారిపోవా లనుకొన్నాను. అలా అయితే నా మాట ఏమయినా మా అన్నయ్య రామానికి చదువు బాగా సాగుతుంది. మా నాన్న తనంతట తాను వాడికి ఆట్టే చదువు చెప్పించలేరు. చెప్పించరు కూడాను. నేనేగాని లేకపోతే, అసలు మామయ్యకి

వాడంటేనే ఇష్టం. అయితే, మా అత్తయ్య నేనే కావాలని పట్టుపట్టింది. మా నాన్నకీ, పిన్నికీ ఎవళ్ళమయినా ఒక్కటే—మామయ్యకీ, నాన్నకీ,పిన్నికీ అన్నయ్యకీ అందరికీ బాగానే ఉంటుంది. ఒక్క అత్తయ్యకి మాత్రం బాధగానే ఉంటుంది.కాని.ఏం చేస్తాం, తప్పదు; మా మామయ్య నిరంకుశపరిపాలనలో తనకి ఎలాగూ సుఖం సంతోషం లేవు.''

''అలాగా ? అప్పు డావిణ్ణి చూసి నప్పుడు, మనతో సమంగా సరదాగా ఆడుకొన్నప్పుడు, ''ఎంత సుఖపడు తున్నారో'' అనుకొన్నాను —''

''మా మా మ య్య — తనకి సరదా సంతోషం అన్నవి అక్కర్లేదు సరికదా, ఎవ్వరి కున్నా చూసి ఓర్వలేడు. ఇప్పుడు ఆ గోల అంతా ఎందుకులే......అబ్బ, మళ్ళీ ఎంతలా మెరిసిందో !"

''అటువంటి మెరుపే నిన్ను నాకు చూపెట్టింది.''

''ఏంలాభం, నన్ను విడిచిపెట్టి వెళ్ళి పోతావుగాని...... ''

"లేదు వాసూ ! లేదురా బాబూ !''

"అయితే పద ఇంటికి.''

"ఇంక మనకి ఇల్లు అక్కరలేదు. ఎక్కడ తలదాచుకొందుకి ఆశ్రయం దొరికితే అదే మన ఇల్లు-''

''నీ మాట నిజమేనా అక్కా !''

"నిజమేరా తమ్ముడూ.''

''అయితే మరెందు కాలస్యం ? పద. నా దగ్గర నువ్విచ్చిన డబ్బేకాక, మా పిన్ని ఎప్పుడెప్పుడో ఇచ్చినవి అంతా మొత్తం యాభై రూపాయి లున్నాయి. ఈ రోజంతా అవి జేబులో పెట్టుకొనే తిరుగుతున్నాను. ఇంకా ఏమి టాలోచిస్తున్నావూ ?''

"పసివాడివి, నాతోపాటు నువ్వెన్ని ఇబ్బందులు పడతావో ?"

"మళ్ళీ మొదటికి వచ్చేవూ? ఈ రాత్రి నా అంతట నేను ఎలాగూ వెళ్ళిపోవా లనుకున్నాను-అంతే. ఇందులో నీ తప్పేముంది ?''

"ఏమిటో నీ కున్న ధైర్యం నాకు కలగడంలేదు బాబూ. నువ్వు మీ అన్నయ్యకి లాభం కలగా లని, నీ అంతట నువ్వు ఏ తప్పు చెయ్యకుండా వెళ్ళిపోవా లనుకుంటున్నావు."

"మరి నువ్వు మాత్రం — నువ్వూ ఏ తప్పూ చేసివుండవు. ఏది ఏమయినా నా అక్కయ్యవి కాకపోతావా ?"

"వాసూ ! అందరికీ నామీద నీకున్నంత అభిమానం ఉంటుందా ?''

''లేనివాళ్ళకోసం విచారిస్తావు. ఉన్న వాణ్ణి నన్నువదలి వెళ్ళిపోతానంటావు.''

''నే నలా అనలేదే.కాని,ఒక్కమాట, నిజంగా నీకు ఎప్పుడు కష్టంగా ఉందో అప్పుడు, నా గురించి ఆలోచించకుండా ఇంటికి వెళ్ళిపోతా నని మాట ఇవ్వాలి."

''అదంతా తరవాత చూద్దాము, కాని, ఇకముందు నువ్వు ఎప్పుడూ ఏడవననీ, నీ మనసులోని బాధ నా దగ్గర దాచననీ మాట ఇవ్వాలి."

''ఇంత చిన్నవాడివి, నీ కింత లేసి మాట లెలా వచ్చాయి.''

"నీ విచారం చూస్తూవుంటే వాటంత టవే వస్తున్నాయి. నువ్వీరాత్రి ఆత్మ హత్య చేసుకోవా లని బయలేరేవుకదూ. నేనేగాని, నా మొదటి ఆలోచన ప్రకారం బయల్దేరి పోయివుంటే......"

"ప్రపంచానికి నావంటి దాని బరువు తీరిపోయేది.''

"ఇప్పుడా బరువంతా నా మీద ఉంచు. ఎందు కింత భయం ? ఎలాగైనా బతక లేకపోము. ఇప్పుడే వర్షం కొంచెం తెరి పిచ్చింది. అట్టే ఆలస్యం అయితే రైలందుకోలేం. తరవాత మళ్ళీ పగలు పది గంటలదాకా రైలులేదు. స్టేషన్లో ఎవళ్ళయినా తెలిసినవాళ్ళు కనిపిస్తే మళ్ళీ చిక్కొస్తుంది."

"సరే, నీ మాటే కానీ — దిక్కులేని వాళ్ళకి దేవుడే దిక్కు అంటారు. ఆ దేవుడే నిన్ను నన్ను రక్షించడానికి పంపించా డనుకొంటాను.''

"రోజూ నాకు రాత్రి ఎనిమిదిగంటలకే నిద్ర ముంచుకొని వచ్చేది. ఈ రోజు అసలు రావడమేలేదు."

"తమ్ముడూ, ఎదీ ఆపాట పాడుతూ ఉంటావు చెల్లెలు గురించి...''

"అదా ? ముందు అడుగెయ్యి—ఇప్పుడు పాడితే ఎవరైనా వింటే చాలా చిక్కు—"

"ఓ దగాపడిన చెల్లీ
ఈ జగమంతా చీకటి కాదమ్మా
ఆశాలేశం కలదమ్మా
అదేపిలుచు, అదేపిలుచు వెలుగమ్మా
ఓ దగాపడిన చెల్లీ......''


"—నీకీ పాటంటే ఎందుకింత ఇష్టం?"

"పాటమాటకేంగాని, అయితే నేను నీకు చెల్లినికూడా నన్నమాట ?''

"అదేమీకాదు, నువ్వు వట్టి 'మాల'వి, నేను ఉత్త 'వాసుగాణ్ణి'. నువ్వే నిజంగా చెల్లివయితే ఇంత మారాము చెయ్యనిచ్చే వాణ్ణా ? గబగబ పద పద..."

"చూడు, చూడు, అంత గాలీ, వానా తగ్గి, వెన్నెల ఎలా వచ్చిందో !"

"నీతో గట్టి చిక్కొచ్చిపడిందే—ఇలా అయితే మనకి మరి రైలందినట్టే—



"పోనీ గట్టిగా పాడకు. మెల్లిగా ఆ మాట లను —''

వేగం అడుగు వెయ్యి.''

"ఇంకా ఎంత వేగంగా — చూడగా చూడగా అన్నగారిలా నామీద అథార్టీ చేసేలాగే ఉన్నావు. చూడు, ఈ మసక వెన్నెల వెలుగులో మనతోపాటు మన నీడ లెలా నడుస్తున్నాయో !''



"అవును. అందులో వింతేముంది — అవి మన తోడునీడలు.'' ★